బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఓ బోగస్
- బీసీ కులగణన ఓ తప్పుల తడక
- రిజర్వేషన్లు ఎగ్గొట్టేందుకే ఈ నాటకం
- 50% దాటొద్దని సుప్రీంకోర్టు చెప్పింది
- పక్కాగా కులగణన నిర్వహించి.. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి
- నమస్తే తెలంగాణతో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

వికారాబాద్, ఫిబ్రవరి 24, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు నూలి శుభప్రద్ పటేల్ మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి, అధికారంలోకి వచ్చాక వారి గొంతు కోసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో గత పదేండ్లలో బీసీల జనాభా లక్షల్లో తగ్గినట్టు చూపించారని విమర్శించారు. రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సిన సమయంలో బీసీల జనాభాను తగ్గించి చూపిస్తూ వారిని అణగదొక్కేవిధంగా వ్యవహిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్తారని శుభప్రద్‌పటేల్ నమస్తే తెలంగాణకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

46 శాతానికి తగ్గింపుపై అనుమానాలు

అసెంబ్లీలో బిల్లు తెస్తారు, చట్టం చేస్తారెమో అనుకున్నాం, కానీ కేవలం ప్రకటన మాత్రమే చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లను పెంచే ఉద్దేశం లేదు. బీసీల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ 14 నెలల కాలంలో అన్ని వర్గాలను మోసం చేసినట్టే బీసీలను కూడా తీవ్రం గా మోసం చేసింది. మొదట్నుంచి కూడా బీసీల జనాభా తెలంగాణలో 54 శాతానికిపైగా ఉంటుందని సంఘాలన్నీ చెప్పాయి, గతంలో 51 శాతం ఉంటారన్నా కూడా ఒప్పుకోలేరు. ఇప్పుడు దాన్ని 46 శాతానికి తగ్గించడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ కృష్ణ య్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవుల సంఘాలన్నీ ఈ నివేదికను వ్యతిరేకిస్తున్నాయి. స్వయంగా కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్ననే కులగణన రిపోర్ట్‌ను తగలబెట్టారు. సమైక్య రాష్ట్రంలోనే అన్యాయం జరిగిందని, బీసీల లెక్క తేలలేదని బాధపడుతుంటే.. ఈరోజు పెనం మీదినుంచి పొయ్యి లో పడ్డట్టు బీసీల పరిస్థితి తయారయ్యింది.

బీసీ జనాభాను 22 లక్షలు తగ్గించారు

తెలంగాణ వచ్చిన తర్వాత సమగ్ర కుటుంబ సర్వేలో తెలంగాణ జనాభా 3.68 కోట్లు ఉన్నట్టు తేలింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 3.54 కోట్లు మాత్రమే అని చెప్తున్నది. 16 లక్షల జనాభా వివరాలు అందుబాటులో లేవు. 2014లో 3.68 కోట్లు ఉన్న జనాభా పదేండ్లలో కేవలం రెండు లక్షలు మాత్రమే పెరుగుతుందా ? 2014లో బీసీలు 1,85,61,856 (51 శాతం) ఉన్నా రు, ఇప్పుడు వారి సంఖ్య 1,64,91,790 (46.25 శాతం) అని ప్రభుత్వం లెక్కలు చెప్తున్నది. అంటే బీసీల జనాభా 21,52,677 తగ్గినట్టు చూపిస్తున్నారు. వాస్తవానికి జనాభా వృద్ధి రేటు 1.35 శాతంగా ఉంది. ఆ రేటు ప్రకారం తెలంగాణ జనాభా 4 కోట్లు దాటాలి. ఆధార్ కార్డుల లెక్కలు తీసుకున్నా, రేషన్ కార్డులను తీసుకున్నా జనాభా 4 కోట్లు దాటా లి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 3.70 కోట్లు అని చెప్తున్నది. బీసీలనే కాకుండా ఎస్సీలను 1.75 లక్షలు, ముస్లింలను 1.65 లక్షలు తగ్గించారు. మరోవైపు ఓసీల జనాభాను మాత్రం గతంతో పోలిస్తే 15,89,955 మందిని పెంచారు. 2014లో ఓసీల జనాభా 11 శాతం ఉండగా.. ఇప్పుడు 15.79 శాతం ఉన్నారని చెప్తున్నారు.

ప్రభుత్వ కట్టుకథలు

సామాజిక న్యాయమంటూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా తిరుగుతూ కులగణనపై అందరికంటే ఎక్కువ మాట్లాడుతున్నారు. కర్ణాటక సీఎం సిద్ధారామయ్యను తీసుకొచ్చి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించారు. బీసీ కమిషన్ ఇచ్చిన నివేదికను నిరుడు ఫిబ్రవరిలో క్యాబినెట్ ఆమోదించింది. బీసీల కులగణన చేయాలని అసెంబ్లీలో చేసిన తీర్మానానికి బీఆర్ఎస్‌తో పాటు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఫిబ్రవరి 16న కులగణన బిల్లును అసెంబ్లీ ఆమోదిస్తే.. మార్చిలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఒక్కరోజు ముందు జీవో జారీచేసింది. కులగణనకు సంబంధించి విధి విధానాలను రూపొందించాలని బీసీ కమిషన్‌కు ప్రభుత్వం మెమో ఇచ్చింది. ప్రభుత్వానికి నివేదిక అందజేశాము. ఆ నివేదికను మూడు నెలల వరకు పక్కన బెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సంఘాలు నిలదీశాయి. మొత్తం రిజర్వేషన్లు 50% దాటొద్దని సుప్రీంకోర్టు ఆదేశించగా, రేవంత్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని కట్టుకథలు చెప్తున్నది. వారిచ్చిన జీవోల్లోనే స్పష్టంగా రిజర్వేషన్లు 50% దాటవద్దని పొందుపర్చింది. బయటికి మాత్రం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నది.

రివ్యూ పిటిషన్ వేస్తేనే పెంపు సాధ్యం

ప్రతిఒక్కరి వివరాలను సమగ్రంగా సేకరించి, కులాలవారీగా లెక్కలు తీసి ఆ నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. బీసీల జనాభా 50 శాతం దాటిందని, రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేయాలని సుప్రీంకోర్టును కోరాలి. అప్పుడే రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుంది.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

జనాభా లెక్కలు తీయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల కులగణన కూడా చేయాలని దేశవ్యాప్తంగా బీసీలు కోరుకుంటున్నారు. కానీ ఎన్ని ఆవులున్నాయి, ఎన్ని పందులున్నాయి, మేకలు, గొర్లు, కోళ్లు అంటూ జంతుగణన చేస్తున్న కేంద్రం బీసీ గణనపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బీసీల స్థితిగతులు మారాలంటే వారి జనాభా ఎంతో తేలాలి. అయితే 1931లో నిజాం రాజ్యంలో కులగణన జరిగింది. లెక్కలు తేల్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది, రాష్ట్రాలు ఏం చేసినా సర్వేల వరకు మాత్రమే చేస్తాయి, సంక్షేమ పథకాల అమలు కోసమే వాడుకుంటాయి. కాంగ్రెస్‌కు అన్ని తెలిసి బీసీలను మోసం చేసింది.

ఎన్నికల్లేక చేనేత సంఘాలు నిర్వీర్యం

సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): 12 ఏండ్లుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు లేకపోవడంతో సహకార వ్యవస్థ నిర్వీర్యమైందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్తునే.. వాయిదా వేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సహకార వ్యవస్థను కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే చేనేత సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జియోట్యాగ్ లేని మగ్గాలన్నింటికీ జియోట్యాగ్ వేసి.. నేతన్నలు, అనుబంధ కార్మికులకు నేతన్న పొదుపు పథకం(త్రిఫ్ట్) వర్తింపజేయాలని కోరారు. చేనేత అభయహస్తం అమలును వేగవంతం చేసి అర్హత కలిగిన కార్మికులకు అందించాలని సూచించారు. చేనేత రుణాలను మాఫీ చేస్తామన్న వాగ్దానం నేటికీ నెరవేరలేదని.. వెంటనే రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

మంటల్లో దగ్ధమవుతున్న ట్రావెల్స్ బస్సు

ట్రావెల్స్ బస్సు దగ్ధం

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 24 : జాతీయ రహదారి-44 ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు మంటలు అంటుకొని దగ్ధమైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. సలీం ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి బెంగళూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి శివారులోకి రాగానే బస్సు వెనుక ఉన్న ఒక టైర్ పేలి పెద్ద శబ్దం వచ్చింది. అయినా బస్సు డ్రైవర్ ఒకే టైర్ మీద బస్సును ముందుకు నడపగా.. కొద్దిసేపటికే పేలిన టైర్ నుంచి మంటలు రావడాన్ని బస్సు వెనుక సీటులో కూర్చొన్న ప్రయాణికులు గుర్తించి డ్రైవర్‌కు సమాచారం అందించారు. దీంతో రోడ్డు పక్కనున్న ఓ పెట్రోల్‌బంక్ సమీపంలో బస్సును నిలిపాడు. అప్పటికే మంటలు ఎక్కువై బస్సుకు అంటుకోగా.. భయంతో ప్రయాణికులు 38 మంది కిందికి దిగారు. మంతటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కమలాకర్ తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తులు బాధితులకు

అప్పగింత ప్రక్రియను ప్రారంభించిన ఈడీ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): అగ్రిగోల్డ్ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిన ఆస్తులను బాధితులకు అప్పగించే ప్రక్రియ ప్రారంభమైంది. అగ్రిగోల్డ్‌కు చెందిన రూ.3,339 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ సీజ్ చేసింది. 4 రాష్ట్రాల్లో 2,254 ఆస్తులను అటాచ్ చేసింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, ఢిల్లీలో సీజ్ చేసిన ఈ ఆస్తుల విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.6 వేల కోట్ల వరకు ఉంటుందని ఈడీ అధికారులు తెలిపారు

నరేందర్‌రెడ్డి ఓడినా నష్టం లేదు

మొదటిపేజీ తరువాయి...

ఉచిత బస్సు, రూ.500 సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల దాకా ఫ్రీ కరెంట్, రైతు కూలీలకు 12వేలు.. ఇవన్నీ మీకు అందితేనే కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యిండ్రి.. రైతు భరోసా వస్తేనే.. రుణమాఫీ అయితేనే ఓటెయ్యిండ్రి.. రాకపోతే మీ ఇష్టం ఉన్న నిర్ణయం తీసుకోండి' అని సూచించడంతో పట్టభద్రులు తెల్లముఖం వేశారు. పట్టభద్రుల సమ్మేళనాలు, సభలో తమ గురించి, తమ సమస్యల పరిష్కారం గురించి మాట్లాడాలి గాని ఇలా పథకాలపై ప్రచారం చేయడం ఏమిటని విస్తుపోయారు. ఇపుడున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివిన ఇంజినీర్లకంటే మేస్త్రీలకే ఎక్కువ నైపుణ్యం ఉంటున్నదని, అలాంటి వారి కోసమే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించామని సీఎం చెప్పారు. అన్నిచోట్లా రేవంత్ ప్రసంగం కేసీఆర్, బీఆర్ఎస్ జపంతోనే సాగింది. ఆయాచోట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై రేవంత్ విరుచుకుపడ్డారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు క్యాబినెట్‌లో ఆమోదం రాకపోడానికి కారణం కిషన్‌రెడ్డేనని, కేంద్రంలో ఆయన అడ్డుకోవడం వల్లే తెలంగాణ ప్రాజెక్టులన్నీ నిలిచి పోతున్నాయని, నీటి కేటాయింపులు తేలడం లేదని ఆరోపించారు. ఈ విషయాలన్నీ స్వయంగా బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులే తనతో చెప్పారన్నారు. రేవంత్‌రెడ్డి గవర్నమెంట్‌కు ఎలా సహకరిస్తారని కేంద్ర మంత్రులను కిషన్‌రెడ్డి బెదిరిస్తున్నారని మండిపడ్డారు. మూసీ నది ప్రక్షాళనకు, రీజినల్ రింగ్ రోడ్డుకు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు, సీతారామ నీటి కేటాయింపులకు, రక్షణ భూములు బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని, తెలంగాణ దివాలా తీయాలని బీజేపీ వాళ్లంతా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో రెండు కోట్ల ఉద్యోగాల సంగతి ఏమోగాని, కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కి మోదీ రెండు ఉద్యోగాలైతే ఇచ్చారని ఎద్దేవాచేశారు. కులగణన విషయంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సొల్లు వాగుడుతో ప్రజలను తప్పుదోవ పట్టించి బలహీనవర్గాకే తీరని నష్టం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేకుమార్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, కవ్వంపల్లి సత్యనారాయణ, సీహెచ్ విజయరమణ రావు, మేడిపల్లి సత్యం, ఠాకూర్ మక్కాన్ సింగ్, కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు.

ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన పట్టభద్రులు

మంచిర్యాలలో మధ్యాహ్నం రెండు గంటల వరకు అనుకున్న సమ్మేళనం సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. దీంతో పట్టభద్రులు విసుగెత్తిపోయారు. కాంగ్రెస్ లీడర్లు అందరూ మాట్లాడాక సీఎం ప్రసంగం ప్రారంభించగా అప్పటికే సాయంత్రం ఐదు దాటిపోవడంతో వచ్చిన ప్రైవేట్ స్కూళ్ల సిబ్బంది లేచి వెళ్లిపోయారు. వెంటనే అప్రమత్తమైన స్థానిక కాంగ్రెస్ నాయకులు, పోలీసులు సభ నుంచి ఎవరూ వెళ్లకుండా అడ్డుకోవడం కనిపించింది. నిజామాబాద్‌లోనూ ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లోని రెండు హాళ్లలో పట్టభద్రులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేసినా ఒక్క హాల్ కూడా పూర్తిగా నిండలేదు. రేవంత్ ప్రసంగిస్తుండగానే పట్టభద్రులు లేచి వెళ్లిపోయారు. హాల్ ఖాళీ అవుతుండడంతో ఎవరు బయటకు వెళ్లకుండా తలుపులు మూసేయడం కనిపించింది.

ఎంత ప్రయత్నించినా ప్రతికూల పవనాలు

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం. ఈ స్థానాన్ని మళ్లీ నిలుపుకునేందుకు సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పక్కన పెట్టి విద్యా వ్యాపారి అల్పోర్స్ నరేందర్‌రెడ్డిని బరిలో నిలిపింది. అభ్యర్థి గెలుపు కోసం ఏకంగా ఏడుగురు మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దింపింది. తమ అభ్యర్థి కోసం ఎంత ప్రచారం చేసినా ప్రతికూల పవనాలే వీస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. స్వయంగా ముఖ్యమంత్రి వచ్చి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్తున్నా.. ఇంకో అడుగు ముందుకేసి.. 'రైతులు గుండెల మీద చెయ్యి వేసుకొని, ఆలోచన చేసి రుణమాఫీ జరిగిందని మీరు నమ్మితేనే పట్టభద్రులైన మీ పిల్లలతో మాకు ఓటేయించండి.. సన్న వడ్లకు బోనస్ పడ్డదని మీరు విశ్వసిస్తేనే మాకు ఓటు వేయించండి' అని పట్టభద్రల తల్లిదండ్రులకు పిలుపునివ్వడం గమనార్హం. ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్‌పై పట్టభద్రులు అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తున్నది. మరోవైపు ప్రచారం మొదలు పెట్టిన నాటి నుంచే కాంగ్రెస్ అభ్యర్థి సొంత విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు, తల్లితండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలో రేవంత్ కూడా 'నరేందర్‌రెడ్డి ఓడినా నష్టం లేదు' అని మాట్లాడడంతో కాంగ్రెస్ శ్రేణుల గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది.



కోటపల్లి పీఎస్‌లో సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినదిస్తున్న బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో బీఆర్ఎస్ నాయకులతో పాటు పలువురు ఆటో యూనియన్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. కోటపల్లి మండలం రాంపూర్‌లో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్‌తో పాటు పార్టీ నాయకులను, శ్రీరాంపూర్‌లో బీఆర్ఎస్ మండల కార్యదర్శి పంబాల ఎర్రయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ రఫీక్‌ఖాన్‌ను, చెన్నూర్‌లో రేవెల్లి మహేశ్, బుర్ర రాకేశ్ గౌడ్, వేముల మహేందర్, షఫీని, భీమారం మండలంలో దాసరి మధునయ్యను, జైపూర్, బెల్లంపల్లిలో ఆటో యూనియన్ నాయకులను అరెస్ట్ చేశారు.

నేటి నుంచి మద్యం షాపులు బంద్

- ఎమ్మెల్సీ పోల్ జరగనున్న 7 ఉమ్మడి జిల్లాల్లో అమలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న 7ఉమ్మడి జిల్లాల్లో మూడు రోజుల పాటు మద్యం షాపులు మూసివేయాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో 25 సాయంత్రం 4 నుంచి 27 సాయంత్రం 4 వరకు మద్యం షాపులు బంద్ చేయనున్నారు. కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు కూడా బంద్ చేయాలని ఎక్సైజ్ శాఖ ఆదేశించింది. 27న సాయంత్రం 4 నుంచి యథావిధిగా మద్యం దుకాణాలు కొనసాగనున్నాయి.

నరేందర్‌రెడ్డికి సీపీఎస్ఈయూ మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న వీ నరేందర్‌రెడ్డి(ఆల్పోర్స్)కు సీపీఎస్ఈయూ మద్దతు తెలిపింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత్రప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ సోమవారం మంత్రి డీ శ్రీధర్‌బాబును కలిసి మద్దతులేఖను అందజేశారు.

నర్సిరెడ్డి, అశోక్‌కుమార్‌ను గెలిపించండి

టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న నర్సిరెడ్డి, అశోక్‌కుమార్‌ను గెలిపించాలని అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు ప్రకటనలో కోరాయి. టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, టీజీజేఎల్ఏ, గురుకుల జేఏసీ నేతలు చావరవి, వెంకట్, అనిల్‌కుమార్, తిరుపతి, సురేశ్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా

5 స్థానాలకు ఈసీ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 29తో పదవీ కాలం ముగియనున్న ఐదు స్థానాలకు మార్చి 20న ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొంది. మార్చి 24లోపు ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు సోమవారం ప్రకటించింది. ఎమ్మెల్సీలు మహమ్మద్ మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, యెగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ పదవీ కాలం మార్చి 29తో ముగియనున్నట్టు తెలిపింది. మరోవైపు ఏపీలోనూ ఐదు స్థానాలకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల	మార్చి 3
నామినేషన్‌కు గడువు	మార్చి 10
నామినేషన్ల పరిశీలన	మార్చి 11
నామినేషన్ల ఉపసంహరణకు గడువు	మార్చి 13
పోలింగ్	మార్చి 20, ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకు
లెక్కింపు	మార్చి 20, సా.5 గంటల నుంచి లెక్కింపు పూర్తయ్యే వరకు
ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాల్సిన తేదీ	మార్చి 24

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ రగడ

- అసలు వర్సెస్ వలస మధ్య పోరు
- రేవంత్‌ను కాదని ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ రగడ మొదలైంది. టికెట్ కోసం అసలు కాంగ్రెస్ వర్సెస్ వలస కాంగ్రెస్ మధ్య పోరు మొదలైనట్టు తెలిసింది. సీనియర్ నేతలు, గత అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు త్యాగాలు చేసిన వారంతా టికెట్ ఇవ్వాలని పట్టుబడుతుండగా.. సీఎం మాత్రం మరో ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఆశావహులు సీఎంకు చెక్ పెట్టి.. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ మొదలు పెట్టినట్టు తెలిసింది.

రెండు పోగా.. కాంగ్రెస్‌కు రెండు సీట్లే !

రాష్ట్రంలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం నాలుగు సీట్లు కాంగ్రెస్‌కు, ఒక సీటు బీఆర్ఎస్‌కు వచ్చే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఐ మిత్రపక్షంగా ఉండగా ఎంఐఎం కూడా పరోక్షంగా సహకరిస్తున్నది. సీపీఐకి ఒక సీటు ఇస్తే కాంగ్రెస్‌కు మిగిలేది మూడు సీట్లే. ఎంఐఎం కూడా పట్టుపడితే ఒక సీటు ఇవ్వాల్సి వస్తుంది. ఇదే జరిగితే కాంగ్రెస్‌కు మిగిలేది రెండు సీట్లు మాత్రమే. ఆ రెండు సీట్లకు 25 నుంచి 30 మంది వరకు పోటీ పడుతున్నట్టు సమాచారం.

ఖర్చు లేదు.. మంత్రికీ అవకాశం

ఈ ఎన్నికల కోసం పెద్దగా ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. పార్టీని నమ్ముకుంటే సరిపోతుంది. అందుకే ఈ కోటాలో ఎమ్మెల్సీ కావడానికి నేతలు పోటీ పడుతున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అయితే మంత్రి పదవిని ఆశించే అవకాశం ఉంటుందని పలువురు ఆలోచిస్తున్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే లేకపోవడంతో ఎమ్మెల్సీకే మంత్రి పదవి దక్కుతుంది. కాబట్టి హైదరాబాద్ నేతలు సీటు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్టు తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విస్తృత తనిఖీలు

నిర్మల్ జిల్లాలో రూ.18 లక్షలు పట్టివేత

సోన్, ఫిబ్రవరి 24 : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం నిర్మల్ జిల్లా సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు సోదాలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కారులో రూ.18 లక్షలను ఆధారాలు లేకుండా హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్టు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా తెలిపారు. తనిఖీల్లో సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై గోపి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి 'చేయి' ఇచ్చిన కాంగ్రెస్!

- ఒకే ఎమ్మెల్సీ సీటు ఇస్తామని స్పష్టీకరణ
- హామీ ప్రకారం రెండు సీట్లివ్వాలంటున్న సీపీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీపీఐకి రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు మాట తప్పుతున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అవుతున్న ఐదు సీట్లలో తమకు రెండు కేటాయించాలని సీపీఐ పట్టుబడుతుండగా, ఒకటి మాత్రమే ఇవ్వగలమని కాంగ్రెస్ కరాఖండిగా చెప్పినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీపీఐతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ రెండు ఎమ్మెల్యే (కొత్తగూడెం, మునుగోడు సెగ్మెంట్లు), ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయిస్తామని ఒప్పందం చేసుకుంది. అయితే అప్పటి వరకూ బీజేపీలో ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లోకి రావడంతో సీపీఐ మునుగోడు స్థానాన్ని త్యాగం చేయాల్సి వచ్చింది. ఇందుకుగాను అదనంగా మరో ఎమ్మెల్సీ సీటు ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారు. గత 14 నెలల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన ప్రతిసారి సీపీఐ నేతలు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డితో సీటు కోసం చర్చలు జరుపుతున్నారు. ఎమ్మెల్యే కోటాలో భర్తీ చేద్దామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఇటీవల ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో సీపీఐ నేతలు మరోసారి తమ సీట్ల విషయమై చర్చలు జరిపారు. అయితే గతంలో హామీ ఇచ్చినట్టు రెండు స్థానాలు ఇవ్వలేమని ఒక్కటైతే ఇవ్వగలమని కాంగ్రెస్ పెద్దలు స్పష్టం చేసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో కంగుతిన్న సీపీఐ నేతలు ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ పెద్దలతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

సీపీఐలో బీసీ వాదం తెరపైకి..

కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయిస్తే తమ పార్టీ నుంచి సలికంటి సత్యం, చాడ వెంకటరెడ్డిని బరిలోకి దించా